


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
06-01-2026
పేజీలు: 02

## రాష్ట్రాన్ని అరాచక రాజ్యంగా మార్చారంటూ కూటమి ప్రభుత్వంపై జగన్ ఫైర్

వైసీపీ అధినేత జగన్, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాధారణ ఎంపీపీ ఎన్నికల్లో సైతం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎన్నికలను బలప్రదర్శన వేదికగా మార్చారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఉదయగిరి, రాయదుర్గం నియోజకవర్గాల్లో జరిగిన ఎంపీపీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలను ఉదాహరిస్తూ, కూటమి ప్రభుత్వ దురహంకారాన్ని, ప్రమాదకర స్వభావాన్ని ఈ పరిణామాలు బట్టబయలు చేస్తున్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు మండలంలో ఎంపీపీ ఎన్నికలో ఓటు వేసేందుకు వెళుతున్న తమ పార్టీ ఎంపీటీసీలను నడిరోడ్డుపై అడ్డగించి, దాడులకు పాల్పడ్డారని జగన్ ఆరోపించారు. ఈ దాడిలో ఒక మహిళా ఎంపీటీసీ తీవ్రంగా గాయపడ్డారు. ఒక సభ్యుడిని కిడ్నాప్ చేశారు. మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటన్నింటి వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం, వారు ఓటు వేయకుండా అడ్డుకోవడమే. భయాందోళనలు సృష్టించి, బలప్రయోగంతో వారి ఓటు హక్కును కాలరాయడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాతేయడానికి పథకం ప్రకారం ప్రయత్నించారు" అని జగన్ వివరించారు. ఈ అప్రజాస్వామిక చర్యల సమయంలో పోలీసులు టీడీపీకి కీలుబొమ్మల్లా వ్యవహరిస్తూ, అధికార పార్టీకి మద్దతు పలికారని ఆయన విమర్శించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ మండలంలో కూడా ఇదే తరహా పరిస్థితి



చోటుచేసుకుందని జగన్ పేర్కొన్నారు. "అక్కడ కూడా మా వైసీపీ ఎంపీటీసీలను నిర్బంధించి దూరంగా ఉంచారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండిపోయారు. వారి అండతోనే అక్కడ ఎంపీపీ ఎన్నికను బలవంతంగా పూర్తి చేశారు" అని ఆయన మండిపడ్డారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేయడం, వారిపై దాడులు చేయడం, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం వంటి చర్యలు కూటమి ప్రభుత్వంలో సర్వసాధారణమైపోయాయని జగన్ విమర్శించారు. దేశానికి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పే చంద్రబాబునాయుడు, రాష్ట్రాన్ని అరాచక, ఆటవిక రాజ్యంగా మార్చినందుకు సమాధానం చెప్పాలి. ఒక చిన్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే, ఈ ప్రభుత్వం ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందో, ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకంగా మారిందో స్పష్టమవుతోంది అని జగన్ వ్యాఖ్యానించారు.



## టైగర్ మళ్లీ ఎంట్రీ

మహబూబాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోంది. ముఖ్యంగా గంగారం, కొత్తగూడ మండలాల్లో పులి కదలికలు గుర్తించినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. పులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే సమీప గ్రామాల్లో పులి నుంచి రక్షణకు అధికారులు ప్రత్యేకంగా భద్రత పెంచారు. పులి నుంచి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టామని అధికారులు వెల్లడించారు. పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ సమీప ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. గంగారం మండలం దుబ్బగూడెం, జంగాలపల్లి అడవుల్లో పులి పాదముద్రలు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఫారెస్ట్ అధికారులు, వన్యప్రాణి సంరక్షణ అధికారులు అటవీ సమీప ప్రాంతాలను పరిశీలించారు. పులి స్థానిక ప్రాంతాల్లో తిరుగుతుందని గుర్తించామని అన్నారు. అలాగే, కొత్తగూడ మండలంలోనూ పులి సంచరించినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. పులి గ్రామంలోకి వస్తే ప్రజల భద్రతకు ముప్పు కలిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.



## అస్వస్థతతో హాస్పిటల్‌లో చేరిన సోనియా గాంధీ

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అస్వస్థతకు గురైనట్టుగా తెలిసింది. ఆమెను ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం సోనియా గాంధీ పరిస్థితి బాగానే ఉందని, తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించాల్సి వచ్చిందని సమాచారం. ప్రస్తుతం సోనియా పరిస్థితి నిలకడగానే ఉందని చెప్పారు. సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో సోనియాగాంధీకి వైద్యం అందిస్తున్నారు. నివేదికల ప్రకారం, సోనియా గాంధీ గత కొద్ది రోజులుగా తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్నారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కాలుష్యం కారణంగా అప్పుడప్పుడు చెకప్‌ల కోసం ఆస్పత్రికి వెళ్తుంటారని తెలిసింది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరినట్లు వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉంటే, ప్రస్తుతం దేశరాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం విపరీతంగా పెరిగింది. ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా మారింది. దీనికి ఓ ప్రమాదకరమైన బ్యాక్టీరియా కూడా వచ్చి చేరిందని జేఎన్‌యూ అధ్యయనం వెల్లడించింది. మందులకు లొంగని బ్యాక్టీరియా ఒకటి గాలిలో ప్రమాదకర స్థాయిలో పెరిగిందని అధ్యయనం తేల్చింది. దీంతో ప్రజలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక మంది ఢిల్లీని వదిలి వెళ్లిపోవాలంటూ పోస్ట్ లు పెడుతున్నారు.

# 850 పోస్టుల భర్తీకి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి చికిత్సను అందించడమే లక్ష్యంగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసనసభ వేదికగా ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న ప్రజల నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1790 వెంటిలేటర్ బెడ్లకు అదనంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటిని గాంధీ, ఉస్మానియా, ఎంజీఎం వంటి ప్రధాన ఆసుపత్రులతో పాటు జిల్లా ఆసుపత్రుల్లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రోగ నిర్ధారణలో కీలకమైన 9 కొత్త ఎంఆర్ఐ యంత్రాలను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కేవలం ప్రధాన నగరాల్లోని ఆసుపత్రులకు పరిమితమైన ఈ సేవలను విస్తరించడం ద్వారా పేదలకు ఖరీదైన పరీక్షలు




ఉచితంగా అందుతాయన్నారు. రాష్ట్రంలోనే అత్యున్నత వైద్య సేవలందించే నిమ్స్ ఆసుపత్రికి వస్తున్న తాకిడిని తగ్గించేందుకు, సేవల నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. నిమ్స్‌లో అదనంగా 125 వెంటిలేటర్లను ఏర్పాటు చేయడంతో పాటు.. నిరుద్యోగులకు తీపి కబురు చెబుతూ ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రమాద కాలంలో ప్రాణాలు కాపాడే ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను ప్రభుత్వం గణనీయంగా తగ్గించిందన్నారు. గతంలో 18 నిమిషాలుగా ఉన్న రెస్పాన్స్ టైమ్.. కొత్తగా వచ్చిన 213 అంబులెన్స్‌ల వల్ల ప్రస్తుతం 13 నిమిషాలకు చేరిందన్నారు. ఈ ఏడాది మరో 79 కొత్త అంబులెన్స్‌లను ప్రవేశపెట్టడం ద్వారా ఈ సమయాన్ని 10 నిమిషాలకు తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. డయాలసిస్ రోగుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సరే కేవలం 20 నిమిషాల ప్రయాణంలో లేదా ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే గత రెండేళ్లలో 16 కొత్త కేంద్రాలు, వందకు పైగా మిషన్లను అదనంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగరాల్లోని సామాన్యులకు చేరువగా ఉండే బస్తీ దవాఖానాల్లో మందుల కొరతను నివారించేందుకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇకపై పీహెచ్‌సీల ద్వారా కాకుండా.. నేరుగా సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్ నుంచే మందులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను అత్యాధునిక వైద్య నిలయాలుగా తీర్చిదిద్ది, సామాన్యుడికి భరోసా కల్పించడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.



## క్రూయిజ్ ట్రిప్ పేరుతో హైదరాబాద్ వ్యక్తికి రూ.2.42 లక్షల కుచ్చుటోపీ

క్రూయిజ్ ట్రిప్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ.2.42 లక్షలు కుచ్చుటోపీ పెట్టారు. పలు దఫాల్లో లక్షల రూపాయలు చెల్లించిన బాధితుడు, చివరకు తాను మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాచిగూడకు చెందిన ఒక వ్యక్తి గూగుల్ సెర్చ్‌లో కనిపించిన వెబ్‌సైట్ ద్వారా డిసెంబర్ 26న కొచ్చి-లక్షద్వీప్-ముంబై క్రూయిజ్ ట్రిప్ బుక్ చేసుకున్నాడు. నాలుగు టిక్కెట్లు తీసుకున్న అతను ముందస్తు అడ్వాన్సుగా రూ.23,680 చెల్లించాడు. ఒకేసారి అంతమొత్తం ట్రాన్స్ ఫర్ అవకపోవడంతో పలు దఫాల్లో చెల్లింపులు జరపాలని అవతలి వ్యక్తి సూచించాడు. లక్షద్వీప్ పర్మిట్ ఛార్జీలు, పిల్లల ఛార్జీలు, సాంకేతిక కారణాలు ఇలా పలు కారణాలు చెప్పి పలుమార్లు అవతలి వ్యక్తి పేమెంట్ చేయించాడు.

## మద్రాస్ హైకోర్టుకు విజయ్




కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ నటిస్తున్న చిత్రం జన నాయగన్. తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీ జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్ మూవీకి సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. రాజకీయ కారణాలతో సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని టీవీకే ఆరోపిస్తోంది. కాగా విజయ్ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మధ్యాహ్నం విచారించనుంది. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రం తెలుగులో జన నాయకుడు టైటిల్‌తో వస్తోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం.. విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం అభిమానులను కలవర పెడుతోంది. ఇంతకీ జననాయగన్ అనుకున్న టైంకు థియేటర్లలోకి వస్తుందా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు అభిమానులు, సినీ జనాలు. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది.




## 17 మంది లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని వెల్లడి

రాష్ట్రానికి చెందిన మరో 17 మంది మావోయిస్టులు లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు 17 మంది మాత్రమే ఉన్నారని ఆయన వెల్లడించారు. వారిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్ గ్రౌండ్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారని ఆయన అన్నారు.ఈ 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.25 కోట్ల రివార్డు ఉందని ఆయన చెప్పారు.



## మూడేళ్ల పిల్లాడిని మింగేసిన నీటి తొట్టి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఒక విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఫాంహౌస్‌లో నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతం మొత్తం విషాదంలో మునిగిపోయింది. పోలీసుల సమాచారం ప్రకారం.. రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన బుద్ధ భాస్కర్ అనే వ్యక్తి కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతని కుమారుడు రన్విత్ కుమార్(3) తల్లిదండ్రులతో కలిసి అదే ఫాంహౌస్ పరిసరాల్లో ఉండేవాడు. బాలుడు ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు ఫాంహౌస్‌లోని నీటి తొట్టిలో పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు.



## రొమాంటిక్ రకుల్

బీచ్ లుక్ & రకుల్ ప్రీత్ సింగ్... కిల్లర్ కాంబినేషన్ అని చెప్పాలి. రామ్ చరణ్ 'బ్రూస్ లీ' సినిమాలో 'పరేషానురా...' పాటలో ఆవిడ ఎంత అందంగా కనిపించారో చూశాం. ఇప్పుడు మరోసారి అటువంటి బీచ్ లుక్ ఫోటోలు షేర్ చేశారు రకుల్. రకుల్ నటించిన లేటెస్ట్ బాలీవుడ్ సినిమా 'దే దే ప్యార్ దే 2'. నవంబర్ 14న రిలీజ్ అవుతోంది. ఆ సినిమా కోసం బీచ్ లుక్ లో సందడి చేశారు రకుల్.'దే దే ప్యార్ దే 2' పెద్ద హిట్. అందులో రకుల్, అజయ్ దేవగణ్ మధ్య సీన్స్ చాలా వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఆ మూవీకి సీక్వెల్ తీశారు. ఇది కొత్త కథ. ఇందులో ఆయేషా పాత్రలో రకుల్ నటించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఏం అందంరా బాబు

అందాల ముద్దుగుమ్మ జాన్వీకపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ముద్దుగుమ్మ తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంది. అతిలోక సుందరి గారాలపట్టీగా సిల్వర్ స్క్రీన్ పై అడుగు పెట్టింది ఈ బ్యూటీ. ధడక్ సినిమాతో వెండితెరపై మొదటి సారిగా సందడి చేసి, ఫస్ట్ సినిమాతోనే సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. తన గ్లామర్, నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచి, వరస సినిమాలతో దూసుకెళ్తుంది. ఇక దేవర సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.



# ఎకో మూవీ రివ్యూ

మలయాళం మేకర్స్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలను గొప్పగా తెరకెక్కించడంలో సిద్ధహస్తులు. ఇక అడవి నేపథ్యంలో కథలను ఆసక్తికరంగా ఆవిష్కరించడంలో వాళ్లు మరింత ముందుంటారు. ఇదే విషయాన్ని మరోసారి నిరూపించిన సినిమానే 'ఎకో'. జయరామ్ - విపిన్ అగ్నిహోత్రి నిర్మించిన ఈ సినిమాకి, దింజిత్ అయ్యతన్ దర్శకత్వం వహించాడు. మిస్టరీ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. కథ: అది దట్టమైన అడవీ ప్రాంతం. కేరళ .. తమిళనాడు .. కర్ణాటక ప్రాంతాలను కలిపే ఆ ఫారెస్టు ఏరియాను తాకుతూ, కురియాచన్ (సౌరభ్ సచ్ దేవ్)కి 150 ఎకరాల ఎస్టేట్ ఉంటుంది. కురియాచన్ ప్రకృతి ప్రేమికుడు. అందువలన అతను ఆ ఎస్టేట్ ను ప్రాణంగా చూసుకుంటూ ఉంటాడు. మలేసియాలో కొంతకాలం పాటు పనిచేసిన ఆయనకి, అక్కడ ఒక బ్రీడ్ కి చెందిన కుక్కల పనితీరును గమనిస్తాడు. అక్కడి కుక్కలను తన ఎస్టేట్ లో పెంచుతూ ఉంటాడు. కురియాచన్ ఇచ్చిన శిక్షణ కారణంగా, అతను వెంట లేకుండా ఆ ఎస్టేట్ లోకి ఎవరూ అడుగుపెట్టలేరు. అలాంటి కురియాచన్ కనిపించకుండా పోయి కొన్నేళ్లు అవుతుంది. అందుకు కారణం ఒక క్రిమినల్ కేసు అని చెప్పకుంటూ ఉంటారు. తన భర్త కోసం ఎదురుచూస్తూ




కురియాచన్ భార్య 'మిలాతియా' (బియానా మోమిన్) ఎస్టేట్ లోని ఒక కొండపై నివసిస్తూ ఉంటుంది. మిలాతియా బాగోగులు చూసుకోవడానికి ఆమె పిల్లలు 'పీయూస్'( సందీప్ ప్రదీప్) ను నియమిస్తారు. కురియాచన్ గురించి తెలుసుకోవడం కోసం అతని స్నేహితుడైన 'మోహన్ పోతన్' (వినీత్) ఆ ఫారెస్ట్ కి వస్తాడు. అయితే ఊహించని విధంగా అతను హత్యకి గురవుతాడు. ఆ తరువాత 'నేవీ'కి చెందిన ఒక ఆఫీసర్ (నరేన్) కూడా కురియాచన్ గురించి ఆరా తీయడానికి వస్తాడు. అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? కురియాచన్ ఏమయ్యాడు? అతని కోసం ఎవరెవరు ఎందుకు గాలిస్తున్నారు? పీయూస్ నేపథ్యం ఏమిటి? అనేది మిగతా కథ. విశ్లేషణ: అడవి అనేది చూడటానికి అందంగానే కనిపిస్తుంది. అక్కడ చిక్కుబడినప్పుడే అసలు స్వరూపం అర్థమవుతుంది. అలాంటి దట్టమైన అడవి నేపథ్యంలో తయారు చేసుకున్న కథ ఇది. కురియాచన్ పాత్ర చాలా సేపటి వరకూ తెరపైకి రాదు. ఆయన కోసం గాలించేవారి చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఆయన ఎవరు? ఏమయ్యాడు? అనే కుతూహలం ఆడియన్స్ ను కూర్చోబెట్టేస్తుంది. సాధారణంగా అడవి అనగానే పులులు .. సింహాలు గట్రా మృగాలను చూపిస్తూ ఉంటారు. కానీ ఈ కథలో మలేసియా కుక్కలు గుంపులుగా వస్తాయి. మలేసియా కుక్కలకు సంబంధించిన నేపథ్యం చుట్టూ రాసుకున్న కథ కూడా కనెక్ట్ అవుతుంది. కురియాచన్ .. కుక్కలపెంపకం పట్ల అతనికి గల ఆసక్తిని లైట్ గా దర్శకుడు పరిచయం చేసినప్పుడు, ప్రేక్షకుడు కూడా ఆ విషయాన్ని లైట్ తీసుకుంటాడు. ఆ తరువాత కథలో కుక్కల వైపు నుంచి పెరుగుతున్న ప్రాధాన్యత ప్రేక్షకులను టెన్షన్ పెడుతుంది కూడా. అసలు కురియాచన్ ఎవరు? అతనికి మిలాతియాతో ఎలా పరిచయం ఏర్పడింది? మలేసియా కుక్కలకు ఈ ఎస్టేట్ కి ఉన్న సంబంధం ఏమిటి? కురియాచన్ భార్య బాగోగులు చూసుకోవడానికి చేరిన పీయూస్ ఉద్దేశం ఏమిటి? అసలు ఆ అడవిలో ఏం జరుగుతోంది?

# హైదరాబాద్‌కు నిరంతరాయంగా నీరు.. రూ.8000 కోట్లతో ఓఆర్ఆర్ చుట్టూ వాటర్ గ్రిడ్!

భాగ్యనగర ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జలమండలి ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. నగరానికి నిరంతరాయంగా, ఎలాంటి అంతరాయం లేకుండా నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ఏకంగా రూ.8,000 కోట్ల అంచనా వ్యయంతో భారీ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఒక వాటర్ రింగ్ మెయిన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలన్న ఈ ప్రతిపాదనకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక కూడా పూర్తయింది. త్వరలోనే దీన్ని పరిపాలన, ఆర్థిక అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి




సమర్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పాక్షికంగా లీనియర్ పైప్‌లైన్ వ్యవస్థ అమల్లో ఉంది. దీనివల్ల ప్రధాన పైప్‌లైన్‌లో ఎక్కడైనా మరమ్మతులు వచ్చినా లేదా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా, ఆ లైన్‌పై ఆధారపడిన లక్షలాది మందికి గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోంది. ఉదాహరణకు, ఎల్బీ నగర్ జోన్‌లోని కొన్ని ప్రాంతాలు అక్కంపల్లి రిజర్వాయర్‌పైనే ఆధారపడటంతో 3 నుంచి 4 రోజులకు ఒకసారి మాత్రమే నీటిని పొందుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించి, నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ రింగ్ మెయిన్ వ్యవస్థను ప్రతిపాదించారు. కోటిన్నర జనాభాకు చేరువవుతున్న నగరానికి ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది.



# కవిత జైలుకు వెళితే విడిపించుకు రావడానికి హరీశ్ రావు ఎంతో కృషి చేశారని వెల్లడి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాత, ఇప్పుడు శాసనమండలికి వెళ్లి కంటతడి పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు గొంగిడి సునీత విమర్శించారు. మద్యం కుంభకోణంలో కవిత జైలుకు వెళ్ళినప్పుడు ఆమెను విడిపించడానికి హరీశ్ రావు ఎంతో కృషి చేశారని ఆమె అన్నారు. కవిత కూర్చున్న కొమ్మను నరుక్కునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. కవిత ఎవరో చెప్పినట్లు ఆడుతున్నారని ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్‌లో ఎంపీ స్థానం నుంచి ఓడిపోతే కవిత బాధను చూడలేక కేసీఆర్ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని అన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం ఇష్టం లేదన్న కవిత, తెలంగాణ జాగృతిని భారత జాగృతిగా ఎందుకు మార్చారో చెప్పాలని నిలదీశారు.పార్టీలో ప్రాధాన్యం లేకుండానే రెండుసార్లు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను పార్టీ విస్మరించిందనేది అవాస్తవమని అన్నారు. అమరులను స్మరించుకోవడానికే అమరుల జ్యోతిని నిర్మించినట్లు తెలిపారు. కేసీఆర్‌ను విమర్శిస్తూ కవిత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆమె అన్నారు.

# టారిఫ్‌ల ద్వారా 600 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందన్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం టారిఫ్‌ల విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌ల ద్వారా తమ దేశానికి 600 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం వచ్చిందని, త్వరలో మరిన్ని నిధులు రానున్నాయని ఆయన ప్రకటించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.49.8 లక్షల కోట్లు. ఈ విధానం వల్ల దేశం ఆర్థికంగా బలపడటమే కాకుండా, జాతీయ భద్రత కూడా మెరుగుపడిందని ట్రంప్ వాదించారు. సుప్రీంకోర్టులో రానున్న కీలక తీర్పు నేపథ్యంలో మీడియా ఈ అంశాన్ని తక్కువ చేసి చూపుతోందని ఆయన ఆరోపించారు.తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఆయన ఒక పోస్ట్ చేశారు. మేం టారిఫ్‌ల ద్వారా 600 బిలియన్ డాలర్లకు పైగా వసూలు చేశాం. కానీ ఫేక్ న్యూస్ మీడియా దీని గురించి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. ఎందుకంటే వారు మన దేశాన్ని ద్వేషిస్తారు, అగౌరవపరుస్తారు. సుప్రీంకోర్టులో రానున్న అత్యంత కీలకమైన టారిఫ్‌ల నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికే మీడియా ఇలా చేస్తోంది అని ట్రంప్ ఆరోపించారు.




# ప్రియుడి మోజులో భర్తను చంపేసి నాటకం... నిజామాబాద్ జిల్లాలో దారుణం!

ప్రియుడి మోజులో భర్తను హత్య చేసి, గుండెపోటుగా నమ్మించే ప్రయత్నం చేసిన ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు చేసిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం బొర్గాంలో చోటుచేసుకోగా, స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి హత్య చేసి చివరకు కటకటాల పాలైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పట్టాటి రమేశ్ (35) భార్య సౌమ్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తోంది. అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దిలీప్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి, అది క్రమంగా వివాహేతర సంబంధంగా మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం భర్త రమేశ్‌కు తెలియడంతో, ఇద్దరినీ గట్టిగా హెచ్చరించాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని సౌమ్య నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. గత నెల 20న సౌమ్య తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేశ్‌ను ఇంట్లోనే టవల్‌తో ఉరేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అనంతరం భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు నమ్మించి, ఎవరికీ అనుమానం రాకుండా హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించింది. అయితే అంత్యక్రియల సమయంలో రమేశ్ మెడపై గాట్లు కనిపించడంతో గ్రామస్థులకు అనుమానం వచ్చింది. వెంటనే ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించారు. కేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేపట్టగా, అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతోనే హత్య చేసినట్లు సౌమ్య ఒప్పుకున్నట్టు తెలిపారు.


# స్టాలిన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. స్తంభంపై దీపం వెలిగించేందుకు కోర్టు అనుమతి

తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మధురైలోని తిరుపరంకుండ్రం కొండపై ఉన్న రాతి స్తంభంపై దీపం వెలిగించొచ్చు అంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను తాజాగా మద్రాస్ హైకోర్టు (మధురై బెంచ్) సమర్థించింది. గత కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ స్తంభంపై దీపం వెలిగించేందుకు ప్రయత్నించగా.. ప్రభుత్వం అడ్డుకుంది. అక్కడ దీపం వెలిగించడానికి వీల్లేదని ఆదేశించింది. పక్కనే దర్గా ఉండటం వల్ల, శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అంతేకాదు.. అక్కడ దీపం వెలిగించకూడదని శాస్త్రాల్లో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రామ రవికుమార్ సహా పలువురు గత డిసెంబర్ 1న మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై స్పందించిన సింగిల్ జడ్జి.. దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం, దర్గా కమిటీ, వక్ఫ్ బోర్డు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సింగిల్ జడ్జి నిర్ణయాన్ని కొట్టివేయాలి కోరారు. ఈ సందర్భంగా పలు అంశాల్ని కోర్టుకు తెలిపారు. దీప స్తంభం ఉన్న దేవాలయం దర్గాకు చెందినదని, ఇక్కడ దీపం వెలిగించకూడదని శాస్త్రంలో ఉందని, అలాగే దీపం వెలిగించడం వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్ లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించింది.

# మావోయిస్టు రహిత తెలంగాణ దిశగా అడుగులు

డీజీపీ శివధర్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న తెలంగాణ వాళ్లంతా జన జీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అడవుల్లో ఉన్నవారు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీజీపీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 17 మంది ఉన్నారు వీరిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. వీరు గనుక ఆయుధాలు వీడి



లొంగిపోతే.. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న ఆ 17 మందిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు డీజీపీ అధికారికంగా ప్రకటించారు. వీరంతా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. మహిళా మావోయిస్టులు లొంగిపోతే వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, గత కొన్నేళ్లుగా తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది.